క్లుప్తంగా

ఫుట్‌బాల్ పోటీలకు సౌత్‌మోపూరు విద్యార్థులు



నెల్లూరు సిటీ: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు సౌత్‌మోపూరులోని వాణిశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం నుంచి నిర్వహించనున్న పోటీల్లో బాలుర విభాగంలో మోహన్, నితీష్, బాలికల విభాగంలో పుష్ప, వైష్ణవి ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. స్టాండ్‌బైలుగా శివకుమార్, వర్షిత, కీర్తి వ్యవహరించనున్నారని పేర్కొన్నారు.

కార్పొరేషన్ ఈఈగా శేషగిరి



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఈఈగా అళహరి శేషగిరిరావు నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ సూర్యతేజను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పలువురు పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజా హుస్సేనీ, మైనార్టీ సెక్రటరీ అలీం, నేతలు కొణిదెల సుధీర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి అభినందనల వెల్లువ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులై నెల్లూరుకు విచ్చేసిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు డైకస్‌రోడ్డులోని ఆయన నివాసానికి మంగళవారం తరలివచ్చారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



నెల్లూరు (టౌన్): ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగనాయకులపేట సమీపంలోని పెన్నానది, తిక్కన పార్కులో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను బీవీనగర్‌లోని కేఎన్నార్ పాఠశాల, వెంగళరావునగర్‌లోని మున్సిపల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం తొలగించారు. ఎన్‌సీసీ అధికారులు నరేంద్రబాబు, నాగరాజు, పీఐ స్టాఫ్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



నెల్లూరు సిటీ: వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. పోలీసుల వివరాల మేరకు.. బీవీనగర్‌లోని సప్తగిరికాలనీలో సుబ్బరామిరెడ్డి, శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. తండ్రి శ్రీనివాసరెడ్డి ఐదేళ్లుగా కుమార్తె శ్రీదేవి వద్ద ఉంటున్నారు. మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం బయటకెళ్లిన ఆయన తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96304 నంబర్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

విజిటర్స్ హాల్‌కు తాళం



మూసేసిన హాల్

- కార్పొరేషన్ కార్యాలయంలో ఇదీ పరిస్థితి
- ఓ అధికారి ఆదేశాల మేరకు మూత
- చెట్ల కిందే వేచి ఉంటున్న జనం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కొందరు అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట ఇది. వీరి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆఫీస్‌లో విజిటర్స్ కోసం విశాలమైన హాల్ ఉంది. ఇందులో పెద్ద సోఫాలున్నాయి. అంతేకాకుండా సెంట్రల్ ఏసీ సైతం ఉంది. దీంతో పనుల నిమిత్తం వచ్చిన జనం కాసేపు సేదతీరి సంబంధిత అధికారులను కలిసి వెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితే లేదు. ఓ అధికారి ఆదేశాల మేరకు సదరు హాల్‌కు తాళాలేశారు. దీంతో కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్ల కింద జనం వేచి ఉండాల్సి వస్తోంది.

ఎంతో మంది రాక

నెల్లూరు నగర జనాభా సుమారు 8 లక్షలకు పైనే. సమస్యల పరిష్కారం కోసం ఎంతో మంది కార్పొరేషన్ కార్యాలయానికి రోజూ వస్తుంటారు. వీరిలో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులుంటారు. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాలకు సంబంధించిన ఉద్యోగులూ సమావేశాల నిమిత్తం ఇక్కడి విచ్చేస్తారు. వీరందరూ కొంత సమయం వేచి ఉండేందుకు విజిటర్స్ హాల్ ఎంతో ఉపయోగపడేది.

నెల రోజులుగా ఇంతే

హాల్‌కు నెల రోజులుగా తాళాలేసి ఉన్నారు. దీంతో నగర ప్రజలు, సమావేశాల నిమిత్తం విచ్చేస్తున్న సచివాలయాల ఉద్యోగులు చెట్ల కింద వేచి ఉంటున్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని అధికారులు తమ సొంత భవనంలా భావించి ఇష్టానుసారంగా విజిటర్స్ హాల్‌కు తాళాలేయించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ హాల్ ఎప్పుడూ తెరిచే ఉండేది. ఇప్పుడు అధ్వాన పరిస్థితులొచ్చాయి. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించి విజిటర్స్ హాల్‌ను తెరిపించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. దేవస్థానంలో అక్టోబర్ మూడు నుంచి 12 వరకు నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన సమన్వయ కమిటీ సమావేశాన్ని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 మందితో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఉత్సవ కమిటీకి చైర్మన్‌గా అళహరి విజయకుమార్ వ్యవహరించనున్నారని చెప్పారు. దేవస్థానం వద్ద రావణాసుర వధను అక్టోబర్ 11న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కమిషనర్ సూర్యతేజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ అహల్య, ఆర్డీఓ మలోల, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంఘ నేతల ధర్నా



డీటీసీకి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్‌లను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడాన్ని కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆటో కార్మిక సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆటో కార్మిక సంఘం, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్, ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి ఆందోళనను చేపట్టారు. అనంతరం డీటీసీ చందర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆటో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, సురేష్,, లారీ అసోసియేషన్ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నేతలు కొండా స్వామి, మల్లారెడ్డి, సీఐటీయూ రూరల్ గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కిన్నెరకుమార్, ఆటో కార్మిక సంఘ సిటీ కార్యదర్శి మురళి, రూరల్ అధ్యక్షుడు శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ నిధుల విడుదలకు డిమాండ్



బీటీఏ సభ్యత్వ నమోదు

నెల్లూరు సిటీ: పాఠశాలలకు నిర్వహణ నిధులను వెంటనే విడుదల చేయాలని బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆమంచర్ల, కొత్తూరు, బుజబుజనెల్లూరు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిధులను విడుదల చేయకపోవడంతో పాఠశాలల నిర్వహణ కుంటుపడుతోందని చెప్పారు. బీటీఏ నెల్లూరు నగరాధ్యక్షుడు హనీఫ్‌బాబు, నెల్లూరు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి హరి, రవికుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల బాధ్యతల స్వీకరణ



సునీల్‌కుమార్‌కు శుభాకాంక్షలు



వెంకటేశ్వరపురం సెక్షన్ కార్యాలయంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రామ్మూర్తినగర్ సబ్ డివిజన్ డీఈఈగా బాధ్యతలను సునీల్‌కుమార్ మంగళవారం స్వీకరించారు. ఏకేనగర్ సబ్ డివిజన్ డీఈఈగా అశోక్.. వెంకటేశ్వరపురం ఎస్ఈగా చంద్ర ఆచారి బాధ్యతలు చేపట్టారు. చంద్ర ఆచారికి వెంకటేశ్వరపురం సెక్షన్ ఏఈ కృష్ణవేణి తదితరులు శుభాకాంక్షలను తెలియజేశారు.

దంత పరిశుభ్రతపై అవగాహన అవసరం



నెల్లూరు(అర్బన్): దంత పరిశుభ్రతపై అవగాహన ఉంటే వ్యాధులు దరిచేరవని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, ఎన్నెస్సెస్ యూనిట్ నిర్వహణాధికారి ప్రసన్నకుమారి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని దర్గామిట్టలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్నెస్సెస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పలువురు విద్యార్థులకు క్రీడా పోటీలను జరిపారు. వీరికి బహుమతులను ఈ నెల 28న అందజేయనున్నామని డాక్టర్ కామేశ్వరి తెలిపారు. అనంతరం సమీపంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానికులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో 27న జాబ్ మేళా

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భార్గవి ఆటోమొబైల్స్, కాల్గేట్ పామోలివ్, టీవీఎస్ ట్రెయినింగ్ అండ్ సర్వీసెస్, అమరరాజా బ్యాటరీస్, స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్, కాంటినెంటల్ కాఫీ తదితర కంపెనీలు హాజరుకానున్నాయని చెప్పారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్): న్యాయవాదుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలకు వ్యతిరేకంగా కోర్టు విధులను న్యాయవాదులు బుధ, గురువారాల్లో బహిష్కరించనున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించామని చెప్పారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

కరపత్రాల పంపిణీ

నెల్లూరు సిటీ: నగరంలోని 48వ డివిజన్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పంపిణీ చేశారు.

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు



నెల్లూరు(సెంట్రల్): ఆక్వా రైతులకు అవగాహన సదస్సును నగరంలోని ఓ కల్యాణ మండపంలో అవంతి సీడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రొయ్యల వ్యాధి నివారణ నిపుణులు లోకేష్ ట్రాన్ మాట్లాడారు. నాణ్యమైన ఫీడ్‌ను వాడితే మంచి ఫలితాలొస్తాయని చెప్పారు. అవంతి సీడ్స్ జనరల్ మేనేజర్లు పరేష్‌కుమార్, శ్రీనివాస్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి కలెక్టర్ అభినందన




నెల్లూరు(దర్గామిట్ట): భూటాన్‌లో నిర్వహించిన సౌత్ ఏషియన్ ఆట్యా పాట్యా పోటీల్లో పాల్గొన్న బీవీఎస్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థి తుమ్మల పూజితను కలెక్టర్ ఆనంద్ తన చాంబర్‌లో మంగళవారం అభినందించారు. మహిళా జట్టును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేసిన ఆమెకు అభినందనలను తెలియజేశారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని కాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు విజయజ్యోతి, ఉషాకల్యాణి, అరుణ, పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందజేత



నెల్లూరు(బృందావనం): పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో గల ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో దివ్యాంగులకు నిత్యావసర సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి మాట్లాడారు. కుమారుడు పవన్ పుట్టిన రోజును పురస్కరించుకొని నిత్యావసర సామగ్రిని రమానాయుడు అందజేశారని వివరించారు. ప్యూర్ స్మైల్స్ చారిటీస్ పర్వీన్, దొడ్ల ప్రమీలమ్మ, గుమ్మడి రాజగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అబ్దుల్ అజీజ్



నెల్లూరు సిటీ: ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నెల్లూరుకు చెందిన టీడీపీ నేత అబ్దుల్ అజీజ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది. గతంలో నెల్లూరు మేయర్‌గా ఈయన పనిచేశారు. 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

వరద బాధితులకు చేయూత



జేసీకి డీడీని అందజేస్తున్న సభ్యులు

నెల్లూరు(బృందావనం): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.50 వేల విరాళాన్ని జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన డీడీని జేసీ కార్తీక్‌కు ఆయన చాంబర్‌లో మంగళవారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, మాజీ కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మెట్టు సుజన, రఘురామ్ ముదిరాజ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విజయవాడ వరద బాధితులకు సాయాన్ని వాకర్స్ అసోసియేషన్లు ప్రకటించాయి. ఈ మేరకు సీఎం సహాయనిధికి సంబంధించిన రూ.2.85 లక్షల డీడీని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఏసీ సుబ్బారెడ్డి.. ఫ్రెండ్స్.. స్మైల్.. ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డితో కలిసి అందజేశాయి. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కార్యదర్శి గుర్రం వెంకటసురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరామ్, వేలూరు రంగారావు, బాసం శేషగిరిరావు, స్మైల్ వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ కమ్రుద్దీన్, ట్రెజరర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(దర్గామిట్ట): విజయవాడ వరద బాధితులకు వివిధ వాకర్స్ అసోసియేషన్లు ఇచ్చిన రూ.5.80,282 మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ ఆనంద్‌కు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందజేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి జలదంకి సుధాకర్, టీడీపీ నేత అరవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాటలు, నృత్య పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవం.. అరిగెపూడి కృష్ణకుమారిని స్మరిస్తూ కళానీరాజనాన్ని నగరంలోని పురమందిరంలో గురువారం నిర్వహించనున్నామని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను నగరంలోని పురమందిరంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాటలు, నృత్య పోటీలను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. సుబ్రహ్మణ్యం, అమానుల్లాఖాన్, సుబ్బయ్య, రఘురామిరెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో ఎన్నెస్సెస్ ఆవిర్భావ దినోత్సవం



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్నెస్సెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, సాయికుమార్‌రెడ్డి, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు దివ్య, మనోజ్ ప్రభాకర్, సత్యనారాయణ, సురేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లు అంటించడం కాదు..

- ప్రజా సమస్యలను పరిష్కరించాలి
- సీపీఎం నేతల డిమాండ్



టిడ్కో గృహ సముదాయంలో పర్యటిస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించడం కాదని, ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ 4800 గృహాలను నిర్మించగా, రెండు వేల మందే నివాసం ఉంటున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, తాగునీటిలో మురుగు కలుస్తుండటంతో అంటు వ్యాధులు సోకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి నెలకొన్నా, పట్టించుకోకుండా.. మంచి ప్రభుత్వం అంటూ స్టిక్కర్లు అంటించటం సిగ్గుచేటని విమర్శించారు. మంత్రి, కలెక్టర్ వెంటనే స్పందించాలని, లేని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. నేతలు ఖాదర్‌బాబు, జాఫర్, అల్లాబక్షు, ఆనంద్, ఖాదర్, ఫజల్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధికి 'నారాయణ'లో శస్త్రచికిత్సలు



పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): తమ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎపిలెప్సీ క్లినిక్, సర్జరీ సెంటర్ ద్వారా మూర్ఛ రోగులకు ఆపరేషన్ చేసి వ్యాధిని నయం చేస్తున్నామని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్, న్యూరాలజీ విభాగాధిపతి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మూర్ఛ ఆపరేషన్ చేయించుకొని వ్యాధి నయమైన పలువురుతో కలిసి ఎపిలెప్సీ స్పెషల్ క్లినిక్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వైద్యులు మాట్లాడారు. ఆస్పత్రిలో ఉచిత మూర్ఛ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నామని, ఎమ్మారై లాంటి పరీక్షల్లో 50 శాతం రాయితీని ఇవ్వనున్నామని వివరించారు. శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేస్తున్నామన్నారు. ఎపిలెప్సీ సమాచారం కోసం న్యూరాలజీ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. న్యూరోసర్జన్ సాయికిరణ్, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ హరీష్, న్యూరాలజిస్ట్ అనూష, ఆస్పత్రి ఏజీఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'సింసం' పురస్కారాల ప్రదానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆంజనేయరెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మృత్యర్థం నగరంలోని పురమందిరంలో కార్యక్రమాన్ని సింహపురి సంస్కృతి సమాఖ్య (సింసం) వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నెల్లూరు ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారి రాఘవేంద్రరావు, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, గాయకుడు ప్రసాద్‌బాబు తదితరులకు సింసం పురస్కారాలను ప్రదానం చేశారు. కాగా సినీ సంగీత దర్శకుడు సాలూరు వాసురావుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అవార్డును అందజేయాలని నిర్ణయించినా, కొన్ని అనివార్య కారణాలతో ఆయన హాజరుకాలేకపోయారు. దీంతో పురస్కార కార్యక్రమాన్ని వాయిదా వేశారు. 20 మంది గాయకులతో నిర్వహించిన సంగీత గానలహరి అలరించింది. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, మేకప్ ఆర్టిస్ట్ మల్లాది గోపాలకృష్ణ, గీతాంజలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌పీల సేవలు అభినందనీయం

నెల్లూరు(బృందావనం): ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అందిస్తున్న సేవలను నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి అభినందించారు. ఈఎన్టీ సమస్యలపై పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో అవగాహన సదస్సును సహస్ర హార్ట్, మైండ్‌కేర్ సెంటర్, సుమన వైద్యశాల సౌజన్యంతో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సైకాలజిస్ట్ సుజిత, గుండెవ్యాధి నిపుణుడు నాగభూషణ్, ఈఎన్టీ వైద్యులు సుమన్, కృష్ణారెడ్డి, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, డిస్ట్రిక్ట్ యూత్ కోఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.